క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ



సత్యవేడు సీఐ మురళీనాయుడును సన్మానిస్తున్న కరాటే మాస్టర్లు

సత్యవేడు: కరాటే సాధనతో ఆత్మరక్షణ, ఆత్మ విశ్వాసం చేకూరుతుందని సీఐ మురళీనాయుడు అన్నారు. ఆదివారం సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కోబ్రో, కరాటే వెపన్స్ ట్రెనింగ్ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరాటే వల్ల మెరుగైన శారీరక దృఢత్వం, బలం సమన్వయంతో అనేక ప్రయోజనాలను అందిస్తుందన్నారు. అభ్యాసకులకు స్వీయ రక్షణ నైపుణ్యాలను పుష్కలంగా మెరుగు పరుచుకోవడానికి గొప్ప మార్గం అని చెప్పారు. కరాటే అభ్యసనం ద్వారా ఒత్తిడి తగ్గించడానికి, మానసిక దృష్టిని మెరుగు పరుచుకోవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కరాటేలోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమలో కేరళకు చెందిన కరాటే మాస్టర్లు జాన్సన్, స్థానిక మాస్టర్లు సుబ్రమణ్యం, ఏలుమలై, రమేష్, ఏకేబాబు, ప్రేమ్‌కుమార్, పరంధామన్, శ్రీనివాసన్ తదతరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం పంచాయతీ పరిధిలో ఉన్న బాలగోపాలపురం గిరిజన కాలనీలో రమేష్, భార్య లక్ష్మమ్మ దంపతులు నివాసం ఉంటున్న పూరిల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో మంటలు రేగి పూరి గుడిసె దగ్ధమైంది. ఇంట్లో దాచుకున్న రూ.15 వేలు నగదు, వంట సరుకులు, ఫ్యాను, సిలిండర్, మంచాలు, దుస్తులు, ఇతర ఇంటి సామగ్రి కాలి బూడిదయ్యాయి. జనసేన మండల అధ్యక్షుడు కే.రూపేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నిరుపేద గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

వైభవంగా కావడి మహోత్సవం



కావళ్లతో వెళుతున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లిలో ఆదివారం కావడి మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్తులు మేళతాళాలతో కావళ్లు ధరించి గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు చేపట్టారు. మూకుమ్మడిగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి తరలి వెళ్లారు. ప్రతి ఏడాది గ్రామస్తులంతా తిరుత్తణికి కావళ్లతో వెళ్లి తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ.


ఏర్పేడులో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ఏర్పేడు: సంతమైదానంలో ఆదివారం యువసమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 35 మంది యువకులు హాజరయ్యారు. తిరుపతి రుయా బ్లడ్ బ్యాంకు సిబ్బంది వారి నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నరేష్, నరేంద్ర, తిరుపతి రుయా బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్స్ రఘురాం చౌదరి, వాహిని తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరాలయానికి నగదు బహూకరణ



పరశురామేశ్వరుని సన్నిధిలో బాబ్జి చౌదరి

ఏర్పేడు: గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం నగదు అందజేశారు. యూఎస్‌ఏలో ఉంటున్న ఎన్ఆర్ఐ బాబ్జి చౌదరి ఆలయ అభివృద్ధి కోసం రూ.10 వేలు నగదు అందించారు. అనంతరం ఆయన ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు శాలువాలతో సన్మానించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆడిటర్ సుదర్శన్, పూజారులు పాల్గొన్నారు.

నేడు బీఎస్ఎన్ఎల్ మేళా

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు పక్కన సోమవారం బీఎస్ఎన్ఎల్ ఫ్రీ సిమ్ మేళా నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ ప్రాంతీయ అధికారి వీరరాఘవయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ మేళాలో 3జీ నుంచి 4జీ సిమ్ మారడానికి, నూతన సిమ్‌లు తీసుకోవడానికి, ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మారడానికి వీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబులతో ఇబ్బందులు



రాత్రయితే తొగరాముడి పీహెచ్‌సీ ఆవరణలోనే మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రిళ్లు పీహెచ్‌సీలో విధులు నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నాము. దానికి తోడు ఆవరణం చీకటిగా ఉంటుంది. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి.

– జి.రాజకుమారి, ఏఎన్ఎం, తొగరాముడి పీహెచ్‌సీ, దొరవారిసత్రం

రాత్రిళ్లు భద్రత పెంచాలి



ఆస్పత్రిలో మహిళా డాక్టర్లు, సిబ్బంది రాత్రి సమయాల్లో డ్యూటీ చేసేటప్పుడు మంచి అనుభవం, కరాటే నైపుణ్యం కలిగిన ఉమెన్ కానిస్టేబుళ్లకు గస్ సదుపాయం కల్పించి భద్రత పెంచాలి. రాత్రి వేళల్లో ఆసుపత్రిలో ఉన్న వారందరిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. అలాగే ఆస్పత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. తద్వారా ధైర్యంగా సేవలు అందించే వీలు ఉంటుంది. – మల్లీశ్వరి, స్టాఫ్‌నర్స్ పెళ్లకూరు పీహెచ్‌సీ

వరుణుడి కోసం రైతన్నల ఎదురుచూపు

- వర్షాలు పడకపోవడంతో కరువు పరిస్థితులు
- కరువు మండలాల జాబితాలో బీఎన్‌కండ్రిగను చేర్చి ఆదుకోవాలని రైతుల వినతి
- చుక్క నీరు లేని చెరువులు
- మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో చినుకు నేల రాలకపోవడంతో రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి ఈశాన్య రుతుపవనాలు వస్తాయని, వర్షం పడుతుందని రైతులు ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది. జూలై నెలాఖరులో, ఆగస్టు నెలలో వచ్చిన నైరుతి రుతు పవనాల సమయంలో అయినా వర్షం వస్తుందన్న రైతుల ఆశాలు ఆడి ఆశలయ్యాయి. వర్షం పడితే వ్యవసాయ పనులు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నా గత ఆరు నెలలుగా చినుకు నేల రాలలేదు. దీంతో మండలంలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. కండలేరు, సోమశిల ప్రాజెక్టుల్లో నీరులేక తెలుగుగంగకు నీటిని విడుదల చేయలేదు. దీంతో తెలుగుగంగ కాలువల్లో నీరులేక ఖాళీగా దర్శమిస్తున్నాయి.

చుక్కనీరు లేని చెరువులు..

మండలంలోని 84 చెరువుల్లో చుక్కనీరు లేదు. గతంలో జూన్, జూలై నెలలలో వర్షాలు పడినప్పుడు ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులతో రైతులు బిజీబిజీగా ఉండేవారు. గత సంవత్సరం డిసెంబరు 15వ తేదీ నుంచి వర్షపాతం అంతంత మాత్రంగానే ఉండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చెరువుల్లో చుక్కనీరు లేకపోవడంతో రైతులు పొలాలను దుక్కులు చేయలేదు. దీంతో పొలాలు బీడుగా మారాయి. ఈ సంవత్సరం వేసవికాలంలో పడే అకాల వర్షాలు కూడా పడలేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లో గత సంవత్సరం మండలంలో 1700 ఎకరాలలో వరి పంటను, 1100 ఎకరాలలో వేరుశనగ పంటను రైతులు సాగు చేసేవారు. ఈ దఫా 150 ఎకరాల్లో వరి, 250 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. ఇందులో 45 ఎకరాల్లోని వరిపంట, 35 ఎకరాల్లోని వేరుశనగ పంటకు నీరు చాలక ఎండిపోయాయి. 1200 ఎకరాల్లో చెరుకు పంటను సాగు చేస్తున్నారు. చినుకు నేల పడకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గత సంవత్సరం వర్షాలు లేకపోయినా, తెలుగుగంగ నీరు చెరువులకు చేరడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు పండించుకున్నారు. అదేవిధంగా భూగర్భ జలాల నీటిమట్టం తగ్గడంతో మెట్ట భూముల్లో ఉన్న 2140 బోరు మోటార్లలో 1220 బోర్లలో నీరు సక్రమంగా రావడం లేదు. దీంతో బోరుమోటార్ల కింద సాగుచేస్తున్న వరి, వేరుశనగ, చెరుకు పంటలకు నీరు చాలక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు, రైతులు వలసలకు సిద్ధం అవుతున్నారు. వరుణుడు కరుణించకపోతే రైతుల పరిస్థితి దయనీయంగా మారనుంది. చెరువులకు తెలుగుగంగ నీటిని విడుదల చేసి, పంటలను కాపాడి, కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న కాళంగినది



చుక్క నీరు లేని తెలుగుగంగ కాలువ



దుక్కులు చేయకపోవడంతో బీడుగా మారిన భూమి

రుణాలను అందించి ఆదుకోవాలి..

బ్యాంకుల్లో రైతులకు వడ్డీలేని రుణాలను అందించి ఆదుకోవాలి. బ్యాంకులో తీసుకున్న రుణాలకు వడ్డీ లేకుండా, రెన్యూవల్ చేయాలి. ఉపాధి హామీలో రైతులకు, కూలీలకు పనులను కల్పించాలి. చేతికి వచ్చిన పంట ఎండిపోవడంతో దిక్కుతోచడం లేదు. అధికారులు ఆదుకోవాలి.

– సుబ్రమణ్యం, రైతు, కనమనంబేడు

వలస వెళ్లక తప్పదు..

తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేసి, నష్టపరిహారం ఇవ్వాలి. అప్పులు తెచ్చి వేసిన పంటలు ఎండిపోవడంతో అప్పుల పాలయ్యాను. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోకపోతే వలస వెళ్లక తప్పదు. తెలుగుగంగ నీటిని చెరువులకు అందించి, ఎండిపోతున్న పంటలను కాపాడాలి.

– వెంకటకృష్ణయ్య, రైతు, బుచ్చినాయుడుకండ్రిగ

దేశమ్మకు ప్రత్యేక పూజలు

నాగలాపురం: మండల కేంద్రంలోని దక్షిణపుకోట వీధిలో వెలసిన దేశమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి అమ్మవారి భక్తులు అంబలి పోసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులు, మహిళలు పాలపుంతలతో ఆలయం నుంచి బయలుదేరి దేశమ్మను మాడవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి ప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్దఎత్తున మహిళకు, భక్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు తరలిరండి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబరు 14 నుంచి 17వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు సత్రంలో యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో నాయకుల త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయులు ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ప్రతి కార్యకర్త స్వర్ణోత్సవ మహాసభలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు, మండల స్థాయిలో జరిగే పని సర్దుబాటుకు పొంతన లేదని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పని సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యప్రకాష్, నిర్మల, శేఖర్, రాజేష్‌బాబు, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం



పెరటికోళ్ల పెంపకం ప్రచురణల ఆవిష్కరణ

రేణిగుంట: పెరటికోళ్ల పెంపకం లాభదాయకమని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. మండలంలోని కరకంబాడి వనస్థలిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం చిత్తూరు వ్యవసాయ యాజమాన్యసంస్థ (ఆత్మ) సహకారంతో ×పెరటి కోళ్ల పెంపకం-యాజమాన్య పద్ధతులు×పై శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ ప్రయోగాత్మక కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పెరటి కోళ్ల పెంపకాన్ని చిన్న కుటీర పరిశ్రమగా చేపడితే గ్రామీణ యువత, రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతం నాటు కోళ్లకు మంచి డిమాండ్ ఉందని, సరఫరా తగినంతగా లేదన్నారు. గ్రామీణ యువత ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయిలో అమలుపరచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. అలాగే కోళ్ల పెంపకానికి సంబంధించిన పథకాలు, రాయితీలు కోసం స్థానికంగా ఉండే వెటర్నరీ డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. తర్వాత ఆయన శాస్త్రవేత్తలతో కలసి పెరటి కోళ్ల పెంపకంపై ప్రచురణలను విడుదల చేశారు. శిక్షణ పొందిన యువతకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డి.అనూష, గ్రామీణ యువకులు పాల్గొన్నారు.

ఘనంగా వేమలమ్మకు పొంగళ్లు



వేమలమ్మ దేవతకు పూజ చేస్తున్న అర్చకులు



పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామదేవత వేమలమ్మకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్లు పెట్టారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో వేమలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని పాలతో అభిషేకించి, పూలతో అలంకరించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భారీస్థాయిలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతారాం పవార్ జయంతి



శాంతారాం పవార్‌కు నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ది స్కూల్ ఆవరణలో ఆదివారం ఘనంగా శాంతారాం పవార్ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి కుమార్తె డాక్టర్ అర్చన, సోదరుడు జనార్దన్‌రావ్ పవార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అదే విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్‌గా, పురపాలక సంఘం చైర్మన్‌గా ప్రజల కోసం, భక్తుల కోసం ఆయన చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని విశాల, ప్రముఖులు గాజుల సత్యనారాయణ, శెట్టిపల్లి సురేష్, సుబ్రహ్మణ్యం, ఆవుల జయరాం, ప్రతాప్ రామ్‌పవార్, పరమేశ్వరరావు పవార్, ప్రసన్న, మధు, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు వెంకన్న ఆలయంలో గోకులాష్టమి

నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోకులాష్టమి ఉత్సవాలను మంగళవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్యులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తామని అన్నారు. బుధవారం ఉదయం శ్రీకృష్ణస్వామి మాడవీధి ఉత్సవం, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, కృష్ణస్వామికి ఏకాంత స్నపన తిరుమజనం, ద్వాదశారాధన చేపడుతామని అన్నారు. సాయంత్రం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న, శ్రీకృష్ణస్వామి వేర్వేరుగా తిరుచ్చి వాహనం అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తూ, సన్నిధి వీధిలో నిర్వహించే ఉట్లోత్సవాన్ని తిలకించడానికి వేంచేస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని వారు కోరారు.

వైభవంగా చెంగాళ పరమేశ్వరి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న చెంగాళ పరమేశ్వరిదేవి

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అత్యంత వైభవంగా అమ్మవారి వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వసంతోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పుష్పాలంకరణలు నిర్వహించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటా కర్పూర హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పసుపునీళ్లు చల్లుకుని వసంతోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త బొప్పన తిలక్ బాబు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



పిల్లలకు పోషక పదార్థాలు పంపిణీ

ఏర్పేడు: నాగంపల్లి సమీపంలోని డేవిడ్ లూయిస్ రీస్ ఆస్పత్రిలో పిల్లలకు పోషకాహార పదార్థాలు అందజేశారు. లవ్ ఇన్ యాక్షన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంది, ఉద్ది, పెసర, వేరుశనగ పప్పు, కోడిగుడ్లు, అరటి పండ్లు, మల్టీ విటమిన్లు తదితర 25 రకాల ఆహార పదార్థాలతోపాటు ఏఆర్‌టీ మందులు పంపిణీ చేశారు. పిల్లలకు ఆరోగ్య సూచనలు, ఆటలు, పాటలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. లవ్ ఇన్ యాక్షన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రీస్, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ రామచంద్రయ్య, పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా సత్సంగ వార్షికోత్సవం

నారాయణవనం: మండలంలోని పాలమంగలం ఉత్తరపుకండ్రిగ సాయిబాబా సత్సంగ కేంద్రంలో 4వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సాయిబాబా నిత్యప్రార్థన, పారాయణం, నిత్యకైంకర్య పూజలు నిర్వహించారు. సంకీర్తనలు, నృత్య ప్రదర్శనలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాదం అందించారు. సాయంత్రం సాయిబాబా, బోధకుడు శరత్ బాబూజీ చిత్రపటాలను పుష్పాలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం చేపట్టారు. ఊరేగింపులో చిన్నారుల కోలాటం, సాయిబాబా కీర్తనలు అందరినీ ఆకట్టుకుంది. రాత్రి అఖండ దీపారాధన చేసి భక్తులకు సాయిబాబా నైవేద్య తీర్థప్రసాదాలను అందజేశారు. సర్పంచ్ సాయిరవి, గ్రామస్తులు పర్యవేక్షించారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం పంపిణీ



పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న తాయిమన్ సెల్వం, కవిత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులకు ఆదివారం యూనిఫాం పంపిణీ చేశారు. తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ఎస్.తాయిమన్ సెల్వం, కవిత దంపతులు 54 జతల యూనిఫాం అందజేశారు. వారికి ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపి, స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో ఆదివారం ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం విద్యార్థులతో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్యోధన వధ ఘట్టం



పురవీధుల్లో దర్శనమిస్తున్న ధర్మరాజుల స్వామి

సత్యవేడు: మండల పరిధిలోని పుదుకుప్పంలో ద్రౌపదీదేవి తిరుణాల వైభవంగా జరిగింది. 11 రోజుల పాటు నిర్వహించిన తిరుణాలల్లో తొలిరోజు ధ్వజస్తంభానికి పూజలు చేపట్టి, రెండో రోజు బకాసురునికి భీముడు బండిపై బలికూడు తీసుకుని వెళ్లే ఘట్టం, మూడోరోజు ద్రౌపదీదేవి-అర్జునుడి స్వయంవరం శాస్త్రోక్తంగా ద్రౌపదీదేవి కల్యాణం నిర్వహణ, నాలుగోరోజు ధర్మరాజులు, శకుని జూదం, ద్రౌపదీదేవికి శ్రీకృష్ణుడు చీర బహూకరణ, అర్జున తపస్సు, ధర్మరాజు ఉత్సవం, విరాట పర్వం, ఆదివారం ఉదయం దుర్యోధనుడు, దుశ్శాసనుడి వధ ఘట్టం నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి మణికంఠన్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజల ఆచరించి అగ్ని వెలిగించారు. శనివారం రాత్రి ద్రౌపదీదేవి, ధర్మరాజుల విగ్రహాలను అలంకరించి ట్రాక్టర్లపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపు జరిగింది. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. కంకణం ధరించిన దీక్షాపరులు అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, దేవేంద్రన్, ఎంపీటీసీ శరవణన్, మాజీ ఎంపీటీసీలు వినాయకం తదితరులు పాల్గొన్నారు.







భక్తులను కటాక్షిస్తున్న ద్రౌపదీదేవి అమ్మవారు, దుర్యోధనుడితో తలపడుతున్న భీముడి పాత్రధారి, అగ్నిగుండానికి పూజలు చేస్తున్న అర్చకులు